క్లుప్తంగా

ఆటోలో మంటలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆటోలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. నగరంలోని శివప్రియ లాడ్జి నుంచి ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్తున్న ఓ ఆటోలో బ్యాటరీ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులు ఆందోళనకు గురై కేకలేశారు. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ఆటోను ఆపారు. తోటి వాహనదారులు మంటలను ఆర్పేశారు.

చదువొద్దంటూ ఇంటి నుంచి బాలిక పరార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాగా చదువుకొని ఉన్నత స్థాయికి రావాలని చెప్పిన తల్లిదండ్రులపై అలిగిన ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన నగరంలోని నీలగిరి సంఘంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రోజూ స్కూల్‌కు వెళ్లి బాగా చదువుకోవాలని బాలికకు తల్లిదండ్రులు సూచించారు. తనకు చదువు ఇష్టం లేదని, తాను చదవనంటూ తల్లిదండ్రులపై అలిగి ఇంటి నుంచి శుక్రవారం వెళ్లిపోయారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కాగా బాలిక వెంకటగిరి ప్రాంతంలో ఉందని గుర్తించారు.

ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

ఇందుకూరుపేట: మహిళలను ఆర్థిక స్వావలంబనతో మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో శనివారం వైఎస్సార్ క్రాంతి పథం క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాలను మరింత పటిష్టపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఒక్కో గ్రూపు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆ రుణాన్ని ఏ విధంగా జీవనోపాధికి వినియోగిస్తున్నారనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరేలా చూడాలని సూచించారు. బ్యాంకు, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి రికవరీ, పుస్తకాల నిర్వహణ తదితరాలపై పీడీ సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ టీఆర్‌డీడీ రాజు, డీపీఎం రవికుమార్, స్త్రీనిధి ఏజీఎం హేమంత్ కుమార్, ఏసీ కె.శ్రీనివాసులు, ఏపీఎం ఎన్.రవిశంకర్‌రెడ్డి, నెల్లూరు ఏరియాలోని ఆరు మండలాల పరిధిలో ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణపై జాగ్రత్తలు అవసరం

కొడవలూరు: దంతాల సంరక్షణపై జాగ్రత్తలు అవసరమని వైఎస్సార్ చిరునవ్వు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.నాగేంద్రబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చంద్రశేఖరపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో దంతాల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరమని, అతి వేడి లేదా అతి చల్లని పదార్థాలను తీసుకొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో దంతాలపై ఎనామిల్ దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. చిగుళ్లు అతి సున్నితమైనవి కనుక రెండు నిమిషాల కన్నా ఎక్కువ సేపు పళ్లు తోమరాదన్నారు. పొగాకుతో కూడిన సిగరెట్, బీడీ, ఖైనీ, గుట్కాలు వాడడం వల్ల నోటి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చిన్న పిల్లలు చాక్లెట్ వంటి తీపి పదార్థాలను తిన్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేగా మురళీమోహన్‌రావు, కార్యక్రమ సమన్వయకర్త పి.కావ్య, ఉపాధ్యాయులు శివకుమార్, పెంచలయ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన డీఎస్సార్ విద్యార్థులు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గ్రిగ్స్ మెమోరియల్ క్రీడా పోటీల్లో సత్తాచాటారు. సర్వేపల్లి జోన్ పరిధిలో ఇదే పాఠశాలలో మూడు రోజులపాటు విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఫుట్‌బాల్, హాకీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్స్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.రవీంద్ర కైవశం చేసుకున్నాడు. సీనియర్స్ బాలుర చాంపియన్‌షిప్‌ను, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మహ్మదాపురం డీఎస్సార్ స్కూల్ విద్యార్థులు కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీహెచ్ రామకృష్ణ శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

పోటీ పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పోటీ పరీక్షల ప్రాముఖ్యతపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయానంద్‌కుమార్‌బాబు పోటీ పరీక్షల ప్రాముఖ్యతను, విద్యార్థులు ఎలా సిద్ధం కావాలో క్షుణ్ణంగా వివరించారు.

పకడ్బందీగా బ్రహ్మోత్సవాల నిర్వహణ

• ఆర్డీఓ మలోల

నెల్లూరు(బృందావనం): నగరంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. రంగనాథస్వామి దేవస్థానంలో మార్చి రెండు నుంచి 13 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని దేవస్థాన ప్రాంగణంలో శనివారం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి రెండో తేదీ సాయంత్రం ఆరు గంటలకు అంకురార్పణ జరగనుందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చలువ పందిళ్లు, తాగునీటి సరఫరా, ప్రత్యేక దర్శనం కోసం క్యూలైన్లు, తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థాన మార్గాలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని, తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రథ, తెప్పోత్సవానికి సంబంధించి పరిశీలించి ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత స్వామివారిని ఆర్డీఓ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి వెంకటేశ్వరప్రసాద్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, నెల్లూరు అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా, ఈఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, తదితరులు

గ్రిగ్స్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న తిరుపాల్



హాజరైన క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు సిటీ జోన్ గ్రిగ్స్ పోటీలను ప్రభుత్వ మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ తిరుపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడారు. సిటీ జోన్‌లోని అన్ని పాఠశాలల క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వివిధ క్రీడాంశాల్లో పోటీలను ఈ నెల 28 వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నెల్లూరు సిటీ జోన్ వైస్ ప్రెసిడెంట్ నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫజల్ అలీ, లక్ష్మయ్య, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు సనత్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, గురుప్రసాద్, చంద్రయ్య, రమేష్, రమేష్‌బాబు, శైలజ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

‘మెడికవర్’లో ప్రపంచ స్థాయి కేన్సర్ వైద్యసేవలు

నెల్లూరు(అర్బన్): ప్రపంచ స్థాయి కేన్సర్ వైద్యసేవలను నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో అందిస్తున్నామని ఆస్పత్రి రేడియేషన్ ఆంకాలజిస్టులు ప్రియ, శ్రేయాస్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో కేన్సర్ సేవలను ప్రారంభించిన రెండున్నరేళ్లలోనే 500 మంది రోగులకు విజయవంతంగా రేడియోథెరపీని పూర్తి చేసిన నేపథ్యంలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బందితో కలిసి కేక్‌ను శనివారం కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారిగా నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రిలో అధునాతన రేడియోథెరపీ లినాక్ యంత్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే వెయ్యికిపైగా పెట్ సీటీ స్కాన్లు, 300కుపైగా సర్జరీలు చేశామన్నారు. తమ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న వారు నూరు శాతం కేన్సర్‌ను జయించి పూర్తి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్, పీఆర్వో చందువర్మ, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

నెల్లూరు(బృందావనం): సింహపురి మాయేంద్రజాల్ మ్యాజిక్ ఫెస్ట్‌ను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల పరిధిలోని మెజీషియన్లకు టైగర్ శర్మ మెమోరియల్ క్రికెట్ టోర్నీని వీఆర్సీ మైదానంలో శనివారం నిర్వహించారు. మరణించిన ప్రఖ్యాత మెజీషియన్ల జ్ఞాపకార్థం టోర్నీని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఉదయ్ భాస్కర్ టీమ్, విశాఖపట్నం జట్లు పోటీపడగా, ఉదయ్ భాస్కర్ టీమ్ గెలుపొందింది. స్పాన్సర్లుగా విజన్ మ్యాజిక్ అసోసియేషన్, మైదుకూరు, టైగర్ శర్మ శిష్య బృందం వ్యవహరించారు. తొలుత ప్రఖ్యాత మెజీషియన్లు, సినీనటుడు రమణారెడ్డి, ఉషాకృష్ణమూర్తి, శ్యామ్‌సుందర్, చంద్రకు నివాళులర్పించారు. తెలుగు మెజీషియన్ అడ్మిన్ అలీ, ఏకే రాయల్, టైగర్ మహ్మద్ పర్యవేక్షించారు.



టైలర్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని టైలర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. టైలర్ల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడంపై కృతజ్ఞతలను తెలియజేశారు. 45 ఏళ్లు దాటిన వారికి పింఛన్‌ను ఇవ్వాలని, కుటుంబాలకు గృహ వసతిని కల్పించాలని కోరారు. టైలర్స్ డేను పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు యానాదయ్య, మదార్, మురళీకృష్ణ, సుందరం, యస్దానీబాషా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నిందితుల కోసం ముమ్మర గాలింపు



సీసీ కెమెరాలో నమోదైన నిందితుల ఆనవాళ్లు



మహేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలో శుక్రవారం రాత్రి జరిగిన హత్య కేసులో విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. వైఎస్సార్‌నగర్‌కు చెందిన మహేష్ (28)ను కత్తులు, తల్వార్లతో అతి కిరాతకంగా ఏడుగురు పొడిచి హత్య చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఘటన స్థలానికి చేరుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులు హత్య చేసి పరారవుతున్న దృశ్యాలు కెమెరాల్లో నమోదయ్యాయి. దీని ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందర్ని గుర్తించారని సమాచారం. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలను చేపట్టారు. పాత గొడవలను మనస్సులో పెట్టుకొని హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. హత్యలో ప్రధాన నిందితుడు చింటూ అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం మహేష్ తన స్నేహితులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉండగా, చింటూ వచ్చి.. మహేష్, అతని తల్లిపై అసభ్యకరంగా మాట్లాడారని తెలిసింది. దీంతో మహేష్ ఆగ్రహానికి గురై చింటూపై దాడి చేశారని, అప్పటి నుంచి అతడ్ని ఎలాగైనా అంతమొందించాలని చింటూ నిర్ణయించుకున్నారని పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో కత్తులతో మహేష్ కడుపు, వీపుపై దారుణంగా పొడిచారు. దీంతో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా ఏకాంతసేవ



నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఏకాంతసేవను కనులపండువగా శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా కృష్ణారావు, పద్మావతి వ్యవహరించారు. కాగా 13 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

అమృత్‌సర్‌లో శిక్షణ కార్యక్రమానికి మేయర్

నెల్లూరు సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి మేయర్ స్రవంతి శనివారం హాజరయ్యారు. దేశవ్యాప్తంగా అవలంబిస్తున్న చెత్త సేకరణ, నిర్వహణ పద్ధతులపై తెలుసుకున్నామని ఆమె చెప్పారు.

గాయపడిన వైద్య విద్యార్థి చెన్నైకు తరలింపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి శ్రావణిని మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైకు శనివారం తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి యామిని మృతదేహానికి పోస్ట్‌మార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ శిరీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని జేమ్స్ గార్డెన్‌కు చెందిన శిరీష్ వెంకటగిరి నుంచి నెల్లూరొస్తున్న క్రమంలో ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బృందావనంలో నాటక ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ లేచింది మహిళా లోకం పేరిట వీధి నాటకాన్ని బృందావనంలో శనివారం ప్రదర్శించారు. అనంతరం కళాకారులను అభినందిస్తూ జ్ఞాపికలు, చీరలను అందజేశారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

‘ఓవెల్’లో వైజ్ఞానిక ప్రదర్శన



నెల్లూరు (టౌన్): నగరంలోని ఓవెల్ స్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనను శనివారం నిర్వహించారు. వివిధ అంశాలపై దాదాపు 652 నమూనాలను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ వేణు, సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం బాలు, వైస్ ప్రిన్సిపల్స్ రఫీ, విజయలక్ష్మి, మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతి ఆలయంలో అన్నదానం



నెల్లూరు రూరల్: నగరంలోని 21వ డివిజన్లో గల టీచర్స్ కాలనీలో ఉన్న విజయ గణపతి ఆలయ వార్షికోత్సవ పూజల్లో భాగంగా అన్నదానాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గౌరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగంగా నగర వ్యాప్తంగా రీ సర్వేను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ కార్యదర్శులను సమన్వయపర్చి రీ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యదర్శులకు నిర్దేశించిన లక్ష్యాలను పర్యవేక్షించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రీ సర్వే వివరాలను సమగ్ర సమాచారంతో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని వాణిజ్య ప్రకటనల ప్రదర్శనల పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. అనుమతుల్లేని ప్రకటన బోర్డులను గుర్తించి నోటీసులను జారీ చేయాలన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కోర్టు కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని సూచించారు.



మాట్లాడుతున్న హరిత

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

నెల్లూరు రూరల్: రోటరీ క్లబ్‌ల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను సినీ నటుడు అలీ, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 39వ రోటరీ సమావేశాలను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. సేవా కార్యక్రమాలతో సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రోటరీ సేవలను మరింత విస్తరించాలని కోరారు. రోటరీ గవర్నర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశాలను ప్రారంభిస్తున్న అతిథులు

విద్యార్థినికి అభినందన

నెల్లూరు(బృందావనం): విజయవాడలో ఈ నెల 27, 28న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని మనోజ్ఞను కలెక్టర్ చక్రధర్‌బాబు తన కార్యాలయంలో శనివారం అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయుడు ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ ద్వారా అభినందనలను అందుకున్నారు.



ఘనంగా రత్నం సంస్కృతి వార్షికోత్సవం

నెల్లూరు (టౌన్): సరస్వతీనగర్‌లోని ఐఎంఏ హాల్లో కిషోర్స్ రత్నం స్కూల్స్ సంస్కృతి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను సత్కరించారు. రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

నెల్లూరు(అర్బన్): పొగతోటలోని పలు స్కానింగ్ కేంద్రాలను అధికారులు శనివారం తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు డెమో అధికారి శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, తదితరులు తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లను తనిఖీ చేసిన అనంతరం శ్రీనివాసరావు మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాల్లో ఎంత మందికి స్కానింగ్‌లు చేశారు.. వారిలో గర్భిణులు ఎంత మంది, తదితర వివరాలతో కూడిన ఫారం - ఎఫ్‌ను జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి ప్రతి నెలా ఐదులోపు పంపాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు లేకుండా హాస్పిటళ్లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఐవీఎఫ్ కేంద్రాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

‘విశ్వసాయి ఎస్సార్కే’లో సైన్స్ ఫెస్ట్

నెల్లూరు (టౌన్): మాగుంట లేఅవుట్లోని విశ్వసాయి ఎస్సార్కే ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ ఫెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ తిరుపాల్ హాజరయ్యారు. అనంతరం ఉచిత మెడికల్ క్యాంప్, లియో ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

విశ్వసాయి విద్యా సంస్థల చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ కార్నర్

పేకాట స్థావరంపై దాడులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పేకాట కేంద్రంపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేశారు. కోవూరుకు చెందిన సీతారామిరెడ్డి పొగతోటలోని ఓ ఆస్పత్రి మిద్దెపై గదిని అద్దెకు తీసుకొని పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారం ఎస్‌ఈబీ జిల్లా అధికారి శ్రీలక్ష్మికి అందింది. ఈ క్రమంలో ఆమె ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ నెల్లూరు - 1 అధికారులు, సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. జూదరులు గోపీ, పోలయ్య, హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.8,800 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని స్టేషన్‌కు తరలించారు. తదుపరి విచారణ నిమిత్తం చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో అప్పగించనున్నారు. కాగా నిర్వాహకుడు సీతారామిరెడ్డి పరారీలో ఉన్నారు.



లారీ ఢీకొని స్కూటరిస్ట్‌కు గాయాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లారీ ఢీకొనడంతో స్కూటరిస్ట్ గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మర్రిపాడు మండలానికి చెందిన హనుమంతరావు స్కూటర్‌పై నెల్లూరు బయల్దేరారు. ఈ క్రమంలో వెంకటేశ్వరపురంలోని ఫ్లయ్‌ఓవర్ ఎక్కే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. గాయపడిన హనుమంతరావును జీజీహెచ్‌కు 108లో తరలించారు. నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి కత్తిపోట్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సినిమా చూసేందుకు వచ్చిన వ్యక్తిపై కత్తితో దాడి చేసి నగదు దోచుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొండాయపాళెం గేట్ ప్రాంతానికి చెందిన మణిమాఘలింగం తన భార్య, పిల్లలతో కలిసి నగరంలోని కొత్తహాల్‌కు శుక్రవారం సాయంత్రం వచ్చారు. విరామ సమయంలో తినుబండారాలను కొనుగోలు చేసి పిల్లలకు ఇచ్చి, మంచినీరు తాగేందుకు బయటకొచ్చారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అగ్గిపెట్టె ఉందానని అడిగారు. తన వద్ద లేదని మణిమాఘలింగం చెప్పుండగా, మరో నలుగురు వచ్చి ప్యాంట్ జేబులోని రూ.2500 నగదును లాక్కునేందుకు యత్నించారు. ప్రతిఘటించిన మణిమాఘలింగంపై కత్తితో పొడిచి పరారయ్యారు. చికిత్స నిమిత్తం బాధితుడ్ని జీజీహెచ్‌కు భార్య, పిల్లలు తరలించారు. చిన్నబజార్ ఎస్సై హనీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.